www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 13 నవంబర్ 2024



విజయవాడలో జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖా మంత్రి లోకేష్ నుంచి అవార్డులు అందుకుంటున్న కోటి ప్రభుత్వ మహిళా కళాశాల అధ్యాపకులు డాక్టర్ జి.విజయలక్ష్మి దేవి, ఆర్ట్స్ కళాశాల వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఆర్.నీలయ్య

సమగ్ర శిక్షకు 'అపార్' కష్టాలు

- 406 సిబ్బంది మెడపై టార్గెట్ కత్తి
- రెండు నెలలుగా జీతాలు నిలిపివేత
- ఎంఇఒ ఆఫీస్ సిబ్బందిలో ఆందోళన
- డిఇఒ తీరుపై సర్వత్రా విమర్శలు



అపార్‌కు అప్‌లోడ్ కష్టాలు తప్పడం లేదు. ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో ప్రవేశపెట్టిన అపార్ యాప్‌లో విద్యార్థుల వివరాల్లో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలనే ఉద్దేశంతో ప్రవేశ పెట్టింది. జిల్లాలోని విద్యార్థులు, తల్లిదండ్రుల పేర్లలో ఎలాంటి తప్పిదాలు లేకుండా ఆధార్, రేషన్‌కార్డులు, బర్త్ సర్టిఫికెట్లలో లేకుండా సరిచేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంది. అప్‌లోడ్ బాధ్యతల్ని ఎంఇఒ కార్యాలయ సిబ్బందికి అప్పగించింది. అపార్ లక్ష్యాలను అందుకోలేదనే కోపంతో డిఇఓ రెండు నెలలుగా సమగ్ర సిబ్బంది జీతాలను నిలిపేయడం ఆందోళన కలిగిస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని సమగ్రశిక్ష సిబ్బందికి కష్టాలు తప్పడం లేదు. జిల్లాలో 36 ఎంఇఒ పరిధిలోని 2,832 స్కూళ్లలో సుమారు 3.40 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. వీరి వివరాలను అపార్ అప్‌లోడ్ చేయాల్సిన బాధ్యతల్ని ఎంఇఒ కార్యాలయాల్లోని 406 మంది సమగ్రశిక్ష అభియాన్ సిబ్బందికి జిల్లా విద్యాశాఖ అప్పగించింది. వీరందరూ కాంట్రాక్టు ప్రాతిపదికన నియమితులయ్యారు. వీరిలో కంప్యూటర్ ఆపరేటర్ వంటి ఉద్యోగులు రూ.23 వేల చొప్పున వేతన ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో 36 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, 36 మంది ఎంఐ కో-ఆర్డినేటర్లు, 150 మంది సిఆర్‌పిఎస్, 74 మంది ఓల్డ్ క్రాఫ్ట్ టీచర్స్, 74 మంది ఐఇ కో-ఆర్డినేటర్స్, 36 మంది ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 36 ఎంఇఒ కార్యాలయాల్లో సుమారు 406 మంది సిబ్బంది కలిసి మూడు లక్షల మందికిపైగా విద్యార్థుల వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంది. బర్త్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డుల్లో పిల్లల, తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీలు ఇతర వివరాలను సరిచూసుకుని అప్‌లోడ్ చేయాల్సి ఉంది. చాలా మంది విద్యార్థుల బర్త్ సర్టిఫికెట్స్, ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డుల్లోని పేర్లు, పుట్టిన తేదీల్లో తేడాలు ఉన్నట్లు తెలుస్తోంది. చాలా మంది విద్యార్థుల వివరాలను అప్‌లోడ్ చేయడంలో వెనుకబాటు కనిపించింది. ఇటువంటి విద్యార్థులు తమ బర్త్‌సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డుల్లో పేర్లు, పుట్టిన తేదీలను మార్పు చేసుకోవడానికి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి ఉంది. ఇబ్బందులు కలిగిన విద్యార్థులు సకాలంలో సర్టిఫికెట్లు అందజేయడంలో ఆలస్యమవుతున్న పరిస్థితులు అపార్ అప్‌లోడ్ లక్ష్యాల్ని వెనక్కులాగుతున్నట్లు సమాచారం. జిల్లా విద్యాశాఖాధికారులు అపార్ అప్‌లోడ్ లక్ష్యాల్లో వెనుకబడ్డారనే కారణంతో అక్టోబర్, నవంబర్ మాసాలకు చెందిన జీతాలను నిలిపేయడంపై ఉపాధ్యాయ సంఘాల నుంచి విమర్శలకు ఆస్కారం కలిగిస్తోంది. రాష్ట్రంలో కడప జిల్లా 72 శాతం అప్‌లోడ్ లక్ష్యంతో ఆరవ స్థానంలో నిలిచినట్లు సమాచారం. మెరుగైన స్థానంలో నిలిచినప్పటికీ సిబ్బందికి జీతాలు వేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై డిఇఒను ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాకపోవడం గమనార్హం.

'వర్రా'కు 14 రోజుల రిమాండ్

- కడప సెంట్రల్ జైలుకు తరలింపు
- సజ్జల భార్గవరెడ్డికి లుక్ అవుట్ నోటీసులు

వర్రా రవీందర్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి, సజ్జల భార్గవరెడ్డి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైసిపి సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీందర్‌రెడ్డికి రెండవ ఎడిజెఎం జడ్జి 14 రోజుల రిమాండ్ విధించింది. ఆదివారం సాయంత్రం వర్రా రవీంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, ఉదయ్‌లను మీడియా ఎదుట హాజరు పరిచిన అనంతరం అర్ధరాత్రి సమయంలో రెండవ జెడిఎం జడ్జి దగ్గర హాజరు పరిచిన సందర్భంగా వర్రా రవీంద్రారెడ్డి పోలీసులు టార్చర్ చేశారని, శరీరంపై ఏర్పడిన గాయాలను జడ్జికి చూపించి నట్లు తెలిసింది. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఆయన పిఎ ప్రోద్బలంతోనే వైఎస్ షర్మిల, సునీతలపై పోస్టులు చేశానని చెప్పారంటూ ఒత్తిడి చేశారని, దీనికి ఒప్పుకోకపోవడంతో టార్చర్ చేశారని, మేం ఏమి చెప్పినా ఎస్ అనాలని వీడియో రికార్డు చేశారని వాపోయినట్లు సమాచారం. జడ్జి అతని వాదనల్ని రికార్డు చేసినట్లు తెలిసింది. పోలీసులు తయారు చేసిన రిమాండ్ రిపోర్టులో సజ్జల భార్గవరెడ్డి, కడప జిల్లా సోషల్ మీడియా బాధ్యులు వివేకరెడ్డి బాధ్యతలు తీసుకున్న అనంతరం అనుచిత పోస్టులు పెట్టామని పేర్కొన్నట్లు తెలిసింది.

సజ్జల భార్గవరెడ్డికి లుక్ అవుట్ నోటీసులు

సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టడంలో కీలకపాత్ర పోషించిన అనుమానితులు సజ్జల భార్గవరెడ్డి, అర్జున్‌రెడ్డి సహా పలువురిపై పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. 2020 నుంచి సోషల్ మీడియాలో రాష్ట్రంలోని రాజకీయ ప్రముఖులపై అనుచిత పోస్టులు పెట్టిన కేసులు నమోదైన నేపథ్యంలో జిల్లా పోలీస్ ఉన్న తాఖీదులు ముందుజాగ్రత్త చర్యగా లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. ఈ నెల 8న పులివెందులలో వర్రా రవీందర్‌రెడ్డితో పాటు సజ్జల భార్గవరెడ్డి, అర్జున్‌రెడ్డిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదైన విషయం తెలిసిందే. రాష్ట్రంలో భార్గవరెడ్డిపై ఇప్పటికే పలు క్రిమినల్ కేసులు నమోదు అయ్యాయి. విదేశాలకు పారిపోతారనే అనుమానంతో పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. వర్రా రవీందర్‌రెడ్డి వాంగ్మూలంతో వీరిద్దరి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

సమగ్ర విచారణ చేయాలని వినతి

ప్రజాశక్తి-కాశినాయన

మండల పరిధిలోని అక్కిమ్‌గుండ్ల, సావిశెట్టిపల్లె, ఐటుకలపాడు రెవెన్యూ గ్రామ పొలాలలో ఇతర రాష్ట్రాలకు చెందిన కొంతమంది భూకబ్జాదారులు వందల ఎకరాలు బినామీ పేర్లతో పట్టాలు పొందారని, అలాంటి వారిపై సమగ్ర విచారణ జరపాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు వెంకటి పోలయ్య మంగళవారం బద్వేల్ ఆర్‌డిఒ చంద్రమోహన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పోలయ్య మాట్లాడుతూ అక్కిమ్ గుండ్ల గ్రామ పొలంలో తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నగరానికి చెందిన శ్రీనివాసులు రెడ్డి అనే వ్యక్తి సర్వే నెంబర్‌లు 151, 152, 144, 145, 146, 130, 132, 133, ఇంకా కొన్ని సర్వేనెంబర్లలో మొత్తం 238 ఎకరాలు బినామీ పట్టాలు పొంది ఆక్రమణలో ఉన్నారని పేర్కొన్నారు. ఇదే మండలంలోని బసనపల్లె గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి అక్కిమ్‌గుండ్ల, సావిశెట్టిపల్లె, కత్తెరగండ్ల, అంబవరం, ఐటుకలపాడు, బసనపల్లె, ఆకుల నారాయణపల్లె, గ్రామాలలో దాదాపు 300 ఎకరాలు బినామీ పట్టాలు పొంది పేదలకు అన్యాయం చేశారని అన్నారు నాయనపల్లె గ్రామ పొలంలో ఎమ్మెల్సీ సమీప బంధువులు దాదాపు వందల ఎకరాల భూమిని ఆక్రమించారని ఆర్‌డి దృష్టికి తీసుకెళ్లారు. ఆక్రమణలపై పలుమార్లు జిల్లా అధికారులకు అర్జీ రూపంలో ఫిర్యాదు చేసినా పేదలకు న్యాయం జరగలేదని పేర్కొన్నారు. గతంలో ఆరుగురు తహశీల్దార్లను ఆరు టీమ్‌లుగా విభజించి భూమిపై సమగ్ర విచారణ చేశారు అన్నారు. కానీ పేదలకు ఎక్కడ న్యాయం జరగలేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.

ప్రతి సర్వే నెంబర్‌ను సమగ్రంగా విచారించాలి : ఆర్‌డిఒ

మండల పరిధిలోని అక్కిమ్‌గుండ్ల, సావిశెట్టిపల్లె, ఐటుకలపాడు రెవెన్యూ గ్రామాలలో ఆక్రమణకు గురైన భూములపై విచారణ చేసి సమగ్ర నివేదిక ఇవ్వాలని బద్వేల్ ఆర్‌డిఒ చంద్రమోహన్ తెలిపారు. మంగళవారం ఆయన భూ సమస్యపై జిల్లా కేంద్రానికి వచ్చారు. ఈ సందర్భంగా పోరుమామిళ్ళ, మైదుకూరు, గోపవరం మండలాల రెవెన్యూ అధికారులను పిలిపించారు. ముగ్గురు తహశీల్దార్లను మూడు టీములుగా విభజించి 15 రోజుల లోపల విచారణ పూర్తి చేయాలని ఆదేశించారు. అక్కిమ్‌గుండ్ల రెవెన్యూ పొలానికి గోపవరం తహశీల్దార్ ఆధ్వర్యంలో ఒక టీమ్, ఐటుకలపాడు రెవెన్యూ పొలానికి మైదుకూరు మండలానికి చెందిన రాజశేఖర్ నరేంద్ర నేతృత్వంలో మరో టీమ్, సావిశెట్టిపల్లె రెవెన్యూ పొలానికి పోరుమామిళ్ల తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంకో టీమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. విచారణ నిష్పక్షపాతంగా, పేదలకు న్యాయం జరిగేలా చేయాలని, భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకూడదని అధికారులకు సూచించారు. టీమ్ వెంట ఆర్ఐలు, విఆర్ఒలు, విఆర్ఎలు, సర్వేయర్లు ఉంటారని చెప్పారు. కబ్జాదారులు ఎవరైనా బినామీ పట్టాలు తీసుకుని వస్తే వారిని బినామీలుగా గుర్తించాలన్నారు కార్యక్రమంలో కాశినాయన తహశీల్దార్ వెంకటసుబ్బయ్య, డిప్యూటీ తహశీల్దార్ రవిశంకర్, ఆర్ఐ అమర్‌నాథరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దేశానికి బాలలే భవిష్య సంపద

ప్రజాశక్తి - కడప అర్బన్ : దేశానికి బాలలే భవిష్య సంపద అని యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి అన్నారు. భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ఆధ్వర్యంలో మంగళవారం కడప నగరం పాలకొండలు సమీపంలోగల నగరవనంలో వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు అంటే తెలుసుకోవడమేనని, అది జ్ఞానాన్ని ప్రసాదిస్తుందని, జ్ఞానమే నిజమైన బలమని చెప్పారు. ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ నేటితరం జ్ఞానులైన బాలలు రేపటి ఉత్తమ సమాజ నిర్మాతలుగా గౌరవం పొందుతారన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య పూర్వ అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ మానవత్వాన్ని పెంచే అంశాలు నేటి తరానికి అవసరమన్నారు. డాక్టర్ రంగనాథరెడ్డి మాట్లాడుతూ సామాజిక బాధ్యతను నెరవేర్చడంలో భాగంగా ఇంటాక్ నవ సమాజ నిర్మాతలైన బాలల సర్వతోముఖాభివృద్ధి కోసం ఈ వన భోజనాన్ని ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు, రాయలసీమ టూరిజం సంస్థ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి, నగర వనం అటవీ అధికారి మల్లిక, ఇంటాక్ సభ్యులు నాగవేణి, గౌరీశంకర్, బాల యల్లారెడ్డి, వెల్లాల వెంకటేశ్వరాచారి, లయన్ సంజీవరెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి ఎస్.అమీరుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఈనెల 14న గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం, 15న పుస్తక ప్రదర్శన, 16న విద్యార్థులకు క్విజ్, క్రీడా పోటీలు, 17న కవి సమ్మేళనం, 18న వక్తృత్వ పోటీలు, 19 మహిళా సాధికారిక అఘాయిత్యాలపై సదస్సు, 20న సిపి బ్రౌన్ గ్రంథాలయంలో ముగింపు సభ ఉంటుందని చెప్పారు. విద్యార్థులు, యువత పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

డిఆర్‌ఒగా విశ్వేశ్వరనాయుడు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - కడప

కలెక్టర్‌ను కలిసి బొకే అందజేస్తున్న డిఆర్ఒ

జిల్లా రెవెన్యూ అధి కారిగా ఎం. విశ్వేశ్వర నాయుడు మంగళవారం స్థానిక కలెక్టరే ట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జేసి అదితి సింగ్ ఆదేశాలు, సూచనల మేరకు, ప్రజా ప్రతినిధులు, అధికా రుల సహకారంతో పారదర్శకంగా విధులను నిర్వరి స్తామన్నారు. అంతకు ముందు మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిసి బొకేను అందించారు. 1995 బ్యాచ్‌లో ప్రొబేషనరీ డిప్యూటీ తహశీల్దార్‌గా విధులలో చేరినప్పటినుంచి వివిధ హోదాల్లో, వివిధ జిల్లాల్లో పనిచేస్తూ ఎపిసి ఆర్‌డిఎలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తూ ప్రస్తుతం డిఆర్‌ఒగా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు, సిబ్బంది కలిసి ఆయనకు భాకాంక్షలను తెలియచేశారు.

నేడు కాశినాయన మండల సమావేశం

ప్రజాశక్తి-కాశినాయన

మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ మైథిలి ఒక ప్రటనలో తెలిపారు. సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తమ రిపోర్టును తీసుకొని తప్పక హాజరు కావాలన్నారు. ప్రధానంగా తాగునీరు, విద్యుత్, వైద్య రంగానికి సంబంధించిన సమస్యలపై చర్చిస్తామని పేర్కొన్నారు.

ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలి

- జిల్లాలో కరువు మండలాలు ప్రకటించాలి
- రేపు కలెక్టరేట్ ఎదుట మహాధర్నా

బద్వేల్: తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పేదలు

ప్రజాశక్తి-బద్వేలు

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను, సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని సిపిఎం బద్వేల్ పట్టణ కార్యదర్శి కె. శ్రీను డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా బద్వేల్ పట్టణంలో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సిఐటియు కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు పేదలు ర్యాలీగా వచ్చి ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ భాస్కర్‌రాజుకు సమస్యలతో కూడిని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి మాట్లాడుతూ సామాన్య పేద, మధ్య తరగతి ప్రజలపై రూ.18 వేల కోట్ల రూపాయల విద్యుత్ చార్జీల భారాన్ని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మోపిందని పేర్కొన్నారు. జిల్లాలో కరువు మండలాలుగా ప్రకటించకపోవడం దుర్మార్గమైనటువంటి చర్య అని అన్నారు. జిల్లాలోని రైతులు కరువుతో అల్లాడుతుంటే కనీసం రాష్ట్ర ప్రభుత్వం ఒక్క మండలాన్ని కూడా ప్రకటించకపోవడం చాలా అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో ప్రజలపై విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో భారాలు మోపడం తగదన్నారు. ఉచిత ఇసుక విధానం ఆచరణలో సాధ్యం కాలేదని తెలిపారు. ఈనెల 14న కలెక్టర్ కార్యాలయం దగ్గర 'ప్రజా పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం బద్వేల్ పట్టణ నాయకులు కె.ఎన్. బాబు, ముడియం చిన్ని, ఎస్.కె. ఆదిల్, రాజగోపాల్, మూరా ప్రసాద్, వెంకటపతి, రామలక్ష్మమ్మ, కైరున్ బి, మస్తాన్ బి, ఫాతిమా, బాలస్వామి, బాలమ్మ, నాగలక్ష్మి, నాగమ్మ, సుభాన్ బి, ఫాతిమా, దేవి, గంగయ్య, వెంకటేశ్వర్లు, సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : మండలంలో వర్షాలు సకాలంలో పడక రైతులు వేసిన పంటలు తీవ్రంగా నష్టపోయారని కాబట్టి ఒంటిమిట్టను కరువు మండలంగా ప్రకటించాలని సిపిఎం మండల కార్యదర్శి కోనేటి నరసయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది వర్షాలు పడక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లోనూ సకాలంలో వర్షా లేక వేసిన పంటలు ఎండిపోయాయని వాపోయారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 14న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పుల్లయ్య, సుబ్బరాయుడు, గురుస్వామి, గంగాధర్, రఫీ పాల్గొన్నారు

చింతకొమ్మదిన్నె : జిల్లాలోని ప్రతి మండలంలోనూ కరువు ఛాయలున్నాయని, ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన జాబితాలో ఒక్క మండలం లేకపోవడం శోచనీయమని, ఇందుకు నిరసిస్తూ ఈనెల 14న కలెక్టరేట్ ఎదుట మహాధర్నాను నిర్వహించనున్నామని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. దస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ధర్నాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో తీవ్రమైన కరువు నెలకొందని, రాష్ట్ర ప్రభుత్వం రాయలసీమ జిల్లాలలో 54 కరువు మండలాలుగా ప్రకటించారని పేర్కొన్నారు. జిల్లాలో ఒక్క మండలం కూడా కరువు మండలం ప్రకటించకపోవడం చాలా అన్యాయమని ఆయన తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో పత్తి, వేరుశనగ, కంది, మినుము, పెసర, ఉద్యానవన పంటలకు వర్షాభావం వల్ల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ పెట్టుబడి సహాయం రూ. 20 వేలు రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న గాలేరు- నగరి కాలువను పూర్తి చేసి కరువు రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న ఈ నేపథ్యంలో ప్రజలపై విద్యుత్ ట్రూ ఆఫ్ ఛార్జీల పేరుతో భారాలు మోపడం చాలా దుర్మార్గకరమని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, నాయకులు శ్రీనివాసులురెడ్డి, చిన్న సిద్ధయ్య, రమణ, సుబ్బారెడ్డి, పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు, రైతులు

జీవనశైలి మార్చుకుంటే అదుపులో మధుమేహం

ప్రజాశక్తి - కడప అర్బన్

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అతిథులు

జీవనశైలిలో సరైన మార్పులు, సాంప్రదాయ ఆహార నియమాలే మధు మేహానికి రక్షణ అని డాక్టర్ ఎం.ఎల్.ఎన్. ప్రసాద్ రాజు అన్నారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం 14న పురస్కరించుకుని, వరల్డ్ డయాబెటిక్ వీక్ కార్యక్రమంలో భాగంగా జన విజ్ఞాన వేదిక, ఎస్‌కె ఆర్ అండ్ ఎస్‌కె ఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో జంతు శాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్లు సంయుక్త ఆధ్వర్యంలో మధుమేహ అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మారిన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, ఊబకాయం, దైనందిన జీవితంలో ఒత్తిడి, ఆధునిక జీవనశైలిలో వచ్చిన మార్పులు, పల్లె పట్నం అనే తేడా లేకుండా మధుమేహం చాప కింద నీరులా విస్తరిస్తోందన్నారు. అనంతరం ఆర్. శ్రీనివాసుల రెడ్డి మధుమేహ వ్యాధిపై రూపొందించిన ఛాయాచిత్రం పోస్టర్లను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జంతు శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పి.శచీ దేవి, ఎన్ ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి. విజయలక్ష్మి దేవి, వాహిదా, డాక్టర్ రిజ్వానా, డాక్టర్ జి మీనా కుమారి పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు వేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని పాత బైపాస్ రోడ్డు నుంచి మాచుపల్లికు వెళ్లేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన తారు రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు వేయాలని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ హరికృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆకతాయిల బైక్ రైడింగ్ ఎక్కువగా ఉందని తెలిపారు. ఈ రోడ్డులో విద్యాసంస్థలు బాలికల గురుకుల హాస్టల్ ఉందని పేర్కొన్నారు. ఆకతాయిల ఆగడాలని అరికట్టేందుకు స్పీడ్ బ్రేకులు, జీబ్రా లైన్లు, స్కూల్ జోన్ బోర్డులు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డికి కూడా విజ్ఞప్తి చేశామని తెలిపారు. ప్రమాదాల నుంచి పాఠశాల పిల్లలను కాపాడాలని పేర్కొన్నారు.

18 ఏళ్లు నిండిన వారికి కేన్సర్ పరీక్షలు : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు 18 ఏళ్లు దాటిన వారందరికీ కేన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు 'అందరికీ కేన్సర్ పరీక్షలు' అనే పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ ఈనెల 14 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. 18ఏళ్లు నిండిన వారికి అన్ని రకాల కేన్సర్ పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. 30ఏళ్లు పైబడి వివాహమైన స్త్రీలందరికీ గర్భాశయముఖ ద్వారా కేన్సర్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఏమైనా అనుమానిత కేసులు ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెఫరెల్ చేస్తామని పేర్కొన్నారు. 14న జిల్లాలోని అంగన్వాడీ సెంటర్ లో ఉన్న పిల్లలకు, ప్రభుత్వ పాఠశాలలో ఉన్న విద్యార్థిని, విద్యార్థులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఐ డాక్టర్ ఉమా మహేశ్వర కుమార్, డిపి ఎంఒ డాక్టర్ శశి భూషణం రెడ్డి, డిఎల్ ఎటిఒ డాక్టర్ రవి, ఆర్‌బిఎస్‌కె డాక్టర్ రమేష్, డిబిసిఒ పాల్గొన్నారు.

విద్యుత్ ఉపకరణాలపై అవగాహన అవసరం : ఎస్ఇ

ప్రజాశక్తి - కడప

ఇఇఎస్ఎల్ వారు తక్కువ విద్యుత్ ఖర్చుతో నడిచే విద్యుత్ ఉపకరణాల గురించి ప్రజలలో అవగాహన కల్పించాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ అన్నారు. ఈ ఉపకరణాల వల్ల విద్యుత్ బిల్లులు తగ్గించుకోవచ్చని తెలియజేశారు. మంగళవారం కడపలోని విద్యుత్ భవన్ లోని సమావేశ హాలులో ఊర్జవీర్ పథకం కింద తక్కువ విద్యుత్తుతో నడిచే విద్యుత్ గృహ ఉపకరణాల పై ప్రజలలో అవగాహన కల్పించేందుకు డిప్యూటీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ సి.కామేశ్వరరావు, ఇఇఎస్ఎల్ నోడల్ ఆఫీసర్ రమేష్ బాబు, జిల్లాలోని రిజిస్టర్ ఎలక్ట్రిషియన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపకరణాలు ఎలక్ట్రిషియన్ల ద్వారా వినియోగదారులకు అందజేస్తామని తెలియజేశారు. దీనివల్ల ఎలక్ట్రిషియన్లకు అదనంగా లబ్ధి చేకూరుతుందని తెలియజేశారు. జిల్లాలోని ఎవరైనా ప్రయివేట్ ఎలక్ట్రిషియన్లు https://eeslmart.in/Urjaveer లింకు ద్వారా నమోదు చేసుకుంటే వారు ఇఇఎస్ఎల్ తరపునవిద్యుత్ ఉపకరణాలు ప్రజలకు అందించడానికి అర్హులవుతారన్నారు. రెండేళ్ల నుంచి పదేళ్ల వరకు గ్యారంటీ ఉంటుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేశారన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎలక్ట్రికల్ జిల్లాలోని రిజిస్టర్ ఎలక్ట్రిషియన్లు పాల్గొన్నారు.

నిర్దేశించిన కేంద్రాల్లో ఇసుక పంపిణీ : కలెక్టర్

ప్రజాశక్తి - కడప : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇసుక పంపిణీ ప్రక్రియను జిల్లాలో నిర్దేశించిన బుకింగ్ కేంద్రాల్లో సజావుగా జరగాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్ ఇసుక బుకింగ్, సరఫరా, ఇసుక లభ్యత వంటి అంశాలపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌తో కలసి డిఎల్ఎస్‌సి సమావేశం నిర్వహించారు. ఆర్‌డిఒలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం ఏడూ ఇసుకరీచ్‌లలో ఉన్నాయని, ఒక్కో రీచ్‌లలో దాదాపు పది లక్షల మెట్రిక్ టన్నులు ఇసుక అందుబాటులో ఉందని తెలిపారు .ఇసుక రేవులు, స్టాక్ పాయింట్ల వద్ద ప్రభుత్వం నిర్ణయించిన రేట్ కార్డుల వివరాలను విసిబిలిటీ బోర్డుల ద్వారా ఏర్పాటు చేయాలన్నారు. గామ స్థానిక అవసరాల కోసం ఉచితంగా ఇసుకను తీసుకొళ్లేవారి వివరాలు, వెహికల్ వివరాలను తప్పని సరిగా నమోదు చేయాలన్నారు. ప్రతి స్టాక్ పాయింట్ వద్ద సిసి కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూసుకోవాలన్నారు. అలాగే ఆర్డీవోలు తమ పరిధిలోని స్టాక్ రీచ్‌లను తనిఖీ చేసి అక్కడి సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించాలన్నారు. రియల్టర్లు బిల్డర్లతో ఉచిత ఇసుక విధానం పై సమావేశం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇసుక లభ్యత వినియోగంపై ఎప్పటికప్పుడూ నివేదిక పంపాలని ఆయన సూచించారు. టోల్ ఫ్రీ నెంబర్ ప్రజలకు అందుబాటులో ఉంచి స్టాక్ అపాయింట్లలో ఉన్న ఇసుక లభ్యత వివరాలను విస్తృత ప్రచారం చేయాల న్నారు. కార్యక్రమంలో గనులు భూగర్భ శాఖ డిడి సూర్యచంద్రరావు, జిల్లా పంచాయతీ రాజ్ అధికారిని రాజ్యలక్ష్మి, గ్రౌండ్ వాటర్, ఆర్‌టిఒ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష హోదా కల్పిస్తే అసెంబ్లీకి హాజరు : వైసిపి

ప్రజాశక్తి - కడప : వైసిపి అధినేత వై.ఎస్. జగన్మోహన్ రెడ్డికి ప్రతిపక్ష హోదా ఇవ్వకపోవడంతోనే అసెంబ్లీ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు హాజరు కాలేదని, మాజీ ఎమ్మెల్యే, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో మాట్లాడేందుకు వైసిపి ఎమ్మెల్యేలకు మైకు ఇస్తామని చెప్పండి అసెంబ్లీ సమావేశాలకు తప్పకుండా హాజరవుతారని అన్నారు. మంగళవారం కడప జిల్లా వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్రాను అవినాష్ రెడ్డి పేరు చెప్పమని ఒత్తిడి చేసి కొట్టారన్నారు. ఆయన జడ్జి ముందు వాస్తవాలు చెప్పడంతో కంగుతిన్నారన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో ఎన్నికలు పెట్టినా కూడా సరే అన్ని స్థానాలను వైసిపి కైవసం చేసుకుంటుందని పేర్కన్నారు. ప్రతిపక్ష పార్టీకి మైకు ఇవ్వనప్పుడు వెళ్లి ఏమి చేయాలి అని ప్రశ్నించారు. ప్రజలు సమస్యల గురించి కాదు, అవమానం చేయడానికి పిలుస్తున్నారు అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవన్నారు.

కడప 'ఉక్కు'ను విస్మరించడం దారుణం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో యువతకు ఉపాధి పరిశ్రమ, కడప ఉక్కుకు నిధులు కేటాయించకపోవడం దారుణమని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాలశివకుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ యువతకు ఆశాజనకంగా లేదన్నారు. ముఖ్యంగా ఉపాధి పరిశ్రమల స్థాపన ప్రస్తావనే లేదన్నారు. గత ప్రభుత్వం కడప ఉక్కును నిర్లక్ష్యం చేసిందన్నారు. గత ఎన్నికలలో కడప ఉక్కు నిర్మాణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిది అని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు తీరా చూస్తే బడ్జెట్‌లో కడప ఉక్కుకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని పేర్కొన్నారు. కనీసం కేంద్రంపై ఒత్తిడి తేవడానికి రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం కూడా చేయలేదన్నారు. యువత కడప ఉక్కు కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. బడ్జెట్‌లో అయినా ఉక్కుకు నిధులు కేటాయించి నిర్మిస్తారనుకుంటే అది కూడా అశగానే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు కేటాయించకపోతే రాబోవు రోజులలో కడప ఉక్కు కోసం డివైఎఫ్ఐగా ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో నగర కన్వీనర్ విజయ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమగ్రతతో కూడిన కడపను నిర్మిద్దాం : డిసిసి

ప్రజాశక్తి - కడప

మనందరం ఐకమత్యంగా మరింత బలమైన సమగ్రతతో కూడిన కడపను నిర్మిద్దాం అని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులు ఎన్.డి.విజయ జ్యోతి పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి మహిళలోని శక్తిని ప్రోత్సహించే ఈ విప్లవంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా, ప్రతి మహిళను సామర్థ్యవంతురాలిగా మార్చి, వారిలోని నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే తమ లక్ష్యం అని అన్నారు. పిసిసి అధికార ప్రతినిధి ప్రస్తుత ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచడంతో సిటిజన్లలో ఆందోళన మొదలైందని పేర్కొన్నారు. చాలా మందికి విద్యుత్ ఛార్జీల పెంపు ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచుతోంది అన్నారు. కార్యక్రమంలో యువకాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్ కుమార్, భారత యువ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి మమత నాగిరెడ్డి, ఆంధ్ర ప్రదేశ్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామరావు ఎఐసిసి మాజీ సభ్యులు బండి జకరయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధే ఎమ్మెల్యే 'ఆది' లక్ష్యం

- జడ్పిటిసి బడుగు ఉమాదేవి, నాయకులు బడుగు సురేష్

ప్రజాశక్తి - ముద్దనూరు

జమ్మలమడుగు నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కృషి చేస్తున్నారని ముద్దనూరు జడ్పిటిసి బడుగు ఉమాదేవి, ఎన్డిఎ కూటమి నాయకులు బడుగు సురేష్ పేర్కొన్నారు. మంగళవారం వారు 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధి సిఎం చంద్రబాబు, నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే 'ఆది'తోనే సాధ్యమవుతుందన్నారు. ఎమ్మెల్యే ఆది మండలాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ, ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జమ్మలమడుగులో మెగా జాబ్‌మేళా నిర్వహించారన్నారు. ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య ఆరోగ్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారన్నారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించేందుకు గండికోట జలాశయం ప్రాజెక్టు నుండి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి చెరువులు, కుంటల్లో నీరు నింపేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో సిసి రోడ్లు, తాగునీరు వసతి కల్పించారన్నారు. ఎమ్మెల్యే సహాయ సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేసేందుకు మండల నాయకులు, సామాజిక సేవా కార్యకర్త డాక్టర్ కటికరెడ్డి మధుసూదనరెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తామని ఉమాదేవి, సురేష్ తెలిపారు.

సామాజిక సేవలో టిడిపి యువనేత 'సూరి' ముందడుగు

ప్రజాశక్తి - వేంపల్లె

సామాజిక కార్యక్రమాల్లో తనవంతు సాయం అంటూ టిడిపి యువనేత సింగారెడ్డి రజనీకాంత్ రెడ్డి(సూరి) ముందడుగు వేస్తున్నారు. వేంపల్లెకు చెందిన సింగారెడ్డి రజనీకాంత్‌రెడ్డి ఆయా కార్యక్రమాల్లో భాగస్వామ్యంతో తనవంతు సాయం అందిస్తూ వేంపల్లెలోని పాపాఘ్ని నది సమీపంలో ఉన్న గవి మల్లేశ్వరస్వామి దేవస్థానం సమీపంలో విద్యుత్ దీపాలు లేకపోవడంతో ఆ ప్రాంతమంతా రాత్రి వేళల్లో చీకటిమయం కావడంతో.. ఆ ప్రాంతంలో ఉన్న భూముల వద్దకు రైతులు, ఆలయం వద్దకు భక్తులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గవి మల్లేశ్వర స్వామి ఆలయం వరకు చీకటిమయం కావడంతో విషపురుగులు కూడా ఎక్కువగా రోడ్లపై తిరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యేవారు. కార్తీకమాసం రావడంతో మహిళా భక్తుల సంఖ్య గవి మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద రద్దీ పెరిగింది. వీటిని దృష్టిలో పెట్టుకొని విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో సింగారెడ్డి రజనీకాంత్‌రెడ్డి ఆలయం సమీపంలో నాలుగు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఆ స్తంభాలకు విద్యుత్ లైట్లు వేయించారు. ఇందుకు రైతులు, మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పౌష్టికాహారంతో కంటి సమస్యలు దూరం

చాపాడు : పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కంటి సమస్యలు దూర మవుతాయని కంటి వైద్యాధికారి కెజె రఘురామిరెడ్డి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులందరికీ కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. స్థానిక గొడుగునూరు అప్పయ్యగారి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన విద్యార్థులకు ఉచితంగా అద్దాలు పంపిణీ చేస్తామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌస్ మొద్దీన్, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం స్రవంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది, పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు

వేంపల్లె : మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో నిర్వహించిన ఇంటర్వ్యూలో విద్యార్థులు ఉద్యోగాలు పొందినట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ పేర్కొన్నారు. ఇడుపుల పాయ ట్రిపుల్‌ఐటి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అచల, అంపేర కంపెనీలు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించాయి. అచల కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో ఫైనల్ ఇయర్ సిఎస్‌సి చదువుతున్న 10 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు వచ్చినట్లు చెప్పారు. వీరిని మంగళవారం ఆర్జీయూకేటీ రిజిస్టర్ అమరేంద్ర కుమార్, డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, అకాడమిక్ డీన్ రమేష్ కైలాస్, ప్లేస్‌మెంట్ కో-ఆర్డినేటర్ కేతినేని వినోద్ అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

పార్టీ సభ్యత్వంతో ప్రతి కార్యకర్తకు ఆర్థిక భరోసా

- టిడిపి జిల్లా కార్యదర్శి జయరామిరెడ్డి

ప్రజాశక్తి-వేంపల్లె : తెలుగుదేశం పార్టీ సభ్యత్వంతో ప్రతి కార్యకర్తకు ఆర్థిక భరోసా కలుగుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సింగారెడ్డి జయరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గండి రోడ్డులోని కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జయరామిరెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆర్‌వి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు రామగంగిరెడ్డి నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నేతలు మల్లంగి భాస్కర్‌రెడ్డి, జగన్నాథరెడ్డి, శేషారెడ్డి, రామగంగిరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మేదర రవికుమార్, పాములూరు చంటి, రెడ్డి కిషోర్, రామాంజనేయులు, గువ్వల మురళి, సుధాకర్, కొండారెడ్డి, సింగారెడ్డి శివకృష్ణా రెడ్డి, సింగారెడ్డి ఆదిత్యారెడ్డి, హరికుమార్ రెడ్డి, వార్డు మెంబరు వెంకటేష్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ఐటిలో సెమినార్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : లింగాపురం గ్రామంలో వున్న సాయిరాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఫైనలియర్ ఇఇఇ విద్యార్థులకు ఎలక్ట్రికల్ డిస్ట్రిబ్యూషన్ ఆటోమేషన్ అనే అంశంపై హెచ్ఓడి డాక్టర్ ఏ వెంకటేశ్వరరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ రామ్మోహన్ ఆధ్వర్యంలో సెమివార్ నిర్వహించామని ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి తెలిపారు. ఆధునిక విధానాలను ప్రజంటేషన్ ఇప్పించారు. కార్యక్రమంలో చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరస్పాడెంట్ వీర కల్యాణ్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఘర్షణ కేసులో 18 మందిపై కేసు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె ఎస్‌బిఐ సర్కిల్ సమీపంలో జరిగిన ఘర్షణ కేసులో ఇరు వర్గాలకు చెందిన 18 మందిపై కేసు నమోదు చేసినట్లు సిఐ సురేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి వేంపల్లెలో యువకులు ఘర్షణ పడ్డారు. శ్రీకాంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు 8 మందిపై, మరో వర్గానికి చెందిన నర్సింహులు ఫిర్యాదు మేరకు 10 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఘర్షణకు సంబంధించి విచారిస్తున్నట్లు సిఐ తెలిపారు.

వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ

ప్రజాశక్తి - లింగాల

మండల పరిధిలో పలుచోట్ల వ్యవసాయ పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు పెద్ద కుడాల గ్రామంలో శ్రీనివాసులురెడ్డి, బూచుపల్లె శివకృష్ణారెడ్డి, వెలిదండ్లలో ఓ రైతు పొలంలో దొంగలించిన్నట్లు ఎస్ఐ మధుసూదన్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని సిద్ధారెడ్డిగారి పల్లె గ్రామ సమీపంలో ఉన్న పాపాగ్ని నది నుండి తలుపుల మండలానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లును మంగళవారం సాయంకాలం తహశీల్దార్ విజయకుమారి సీజ్ చేశారు. నాలుగు ఇసుక ట్రాక్టర్లు, నాలుగు ఖాళీ ట్రాక్టర్లను ఎస్ఐ కృష్ణయ్య సహకారంతో సీజ్ చేశారు. ఒక్కో ట్రాక్టర్ నుంచి రూ.250 చొప్పున వసూలు చేసుకుని ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో రావడంతో సంఘటనాస్థలానికి వెళ్లానని తహశీల్దార్ తెలిపారు.

ఆగిన నాడు-నేడు పనులు

తీవ్ర అసౌకర్యాల మధ్య సాగుతున్న బోధన - అధికారులు స్పందించాలని వేడుకోలు

పూనాదులకే పరిమితమైన కోమన్నూతల జిల్లాపరిషత్ హైస్కూలు గదులు

ప్రజాశక్తి - లింగాల

గడువు కాలం ముగిసినా, సాగిన అరకొర నిర్మాణ పనులు నేడు విద్యార్థులకు శాపంగా మారాయి అడ్డుగోడలుగా, అరకొర పనులు చేసి వదిలేశారు. క్షేత్రస్థాయిలో ఎక్కడపడితే అక్కడ నిర్మాణాల మెటీరియల్‌ను పడేశారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పాఠశాల పనులు ప్రస్తుతం విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి. ఎప్పటికి వాటి నిర్మాణ పనులు పూర్తవుతాయనేది కనిపించడంలేదని పలువురు పేర్కొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళనకు గురవుతున్నారు. ఇదంతా లింగాల మండలంలో నాడు-నేడు కింద ఎంపికైన ప్రభుత్వ పాఠశాలల్లో నిర్మాణాల తీరు. నాడు-నేడు పథకం క్రింద లింగాల మండలం పరిధిలోని పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు పుణఃనిర్మాణ పనులు చేపట్టారు కాని ఎన్లు గడుస్తున్న వాటి నిర్మాణా పనులు పునాదులకు, గోడలకు పరిమితమయ్యాయి. దాదాపు 439 మంది విద్యార్థులు సమస్యల బడిలో విద్యను అభ్యసిస్తున్నారు. ఈ క్రమంలో ఇరుకు గదుల్లో, దెబ్బతిన్న స్లాబ్ కింద కూర్చొని భయంభయంగా పాఠంశాలను వింటున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం, అలస్యంగా పనులు చేయడమే ఇందుకు ప్రధాన కారణమనే విమర్శలున్నాయి. కిటికీలు, తలుపులు సరిగా అమర్చకపోవడంతో ప్రస్తుతం పడిన రంధ్రాల నుంచి విష పరుగులు తరగతి గదిలోకి వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. ఇలాంటి సమస్య ఉన్న కొండాపురం హాస్టల్లో ఇద్దరు విద్యార్థులు పాముకాటుకు గురైన విషయం విదితమే. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

కోమన్నూతల జిల్లాపరిషత్ హైస్కూలు శిథిలావస్థకు చేరుకుంది. మరోవైపు ఈ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న 104 మంది విద్యార్థులకు తరగతి గదుల కొరత వేధిస్తున్నాయి. గదులు చిన్నవిగా, ఇరుకగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో నాడు-నేడు కింద కొత్తగా ఎంపికైన తరగతి గదుల నిర్మాణాలు పూనాదులకే పరిమితమయ్యాయి. దీంతో ఆ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరుగుదొడ్ల నిర్మాణాలు కూడా పూర్తి కాకపోవడంతో తీవ్ర అసౌకర్యంగా ఉంది. మరోవైపు ఇప్పటికే ఆ పాఠశాలలో పూర్తయిన నిర్మాణాలు నాసిరకంగా చేయడంతో ప్రమాదకరంగా మారాయి. పెద్ద కుడాల జిల్లాపరిషత్ హైస్కూలులో చేపట్టిన నిర్మాణాలు పూర్తికాలేదు. విధిలేని పరిస్థితుల్లో నిర్మాణంలోని మరుగుదొడ్లను విద్యార్థులు, ఉపాధ్యాయులు కనీస అవసరాలకు వినియోగిస్తున్నారు. ఈ పరిస్థితే మండలంలోని వెలిదండ్ల, బోనాల నెలకొంది.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు..

మండల పరిధిలోని పలు పాఠశాలల్లో నాడు-నేడు కింద అగిపోయిన భవనాల పనులను మొదలెట్టాలి. వాటిని పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలి. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నాం. **- రామకృష్ణ, ఎంఇఒ-2, లింగాల**

నిర్మాణంలోనే నిలిచిపోయిన మరుగుదొడ్లు

పంటల బీమా తప్పక చేయించుకోవాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

రబీలో పంటలు సాగు చేసిన రైతులు వ్యవసాయ బీమా చేయించుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు చంద్రనాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దుంపలగట్టు, భూమాయపల్లె గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ నాగార్జునతో కలిసి ఆయన పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులకు వ్యవసాయ సాగుపై మెలకువలు, సలహాలిచ్చారు. పంటల వారీగా బీమా చెల్లింపు వివరాలు త్వరలో తెలుపుతామన్నారు. అనంతరం డ్రోన్ పరికరం ద్వారా రసాయనిక మందు పిచికారి గురించి వివరించారు. కార్యక్రమంలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ మాధురి, టిడిపి నాయకులు దాసరి శ్రీనివాసులు యాదవ్, ఇండ్ల సుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

చక్రాయపేట : మండలంలోని నెరుసుపల్లె పంచాయతీ పరిధి దేవరగుట్టపల్లెలో మంగళవారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రబీ సీజన్లో పంటలు సాగు చేయబోయే రైతులు నూతన పంట బీమాను తప్పక చేయించుకోవాలని ఎఒ నవంత్ బాబు తెలిపారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు మహేష్ బాబు (విస్తరణ), మహేశ్వరి (పంట ఉత్పత్తి), రైతు శిక్షణా కేంద్ర వ్యవసాయాధికారి నాగభూషణరెడ్డి, వ్యవసాయ సహాయకూరలు శ్వేత, మండల ప్రకృతి వ్యవసాయ అధికారి ప్రతాప్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

చాపాడు : మండల పరిధిలోని నాగులపల్లె, చాపాడు గ్రామాల్లో మంగళవారం ఎఒ మ్యాగీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా మైదుకూరు వ్యవసాయ శాఖ డివిజన్ ఎడిఎ కృష్ణమూర్తి మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులు సాగుచేసిన జొన్న పంటకు కత్తెర పురుగు అధికంగా సోకుతుందన్నారు. దీని నివారణకు డెవిగెట్ 2.5 మిలీ లీటర్ నీటికి పిచికారి చేయాలన్నారు. పురుగు నివారణకు కార్బోఫ్యూరాన్ గుళికలు చల్లాలన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా ద్వారా రబీలో సాగు చేసే వేరుశెనగ, మినుము, జొన్న పంటలకు డిసెంబరు 15లోగా రైతుల వాటా ప్రీమియం రైతు చెల్లించుకోవాలని తెలిపారు. ఖరీఫ్ సీజన్ లో సాగుచేసిన వరి పంట ఆశాజనకంగా ఉందన్నారు. వెన్నుదశలో ఉన్న పంటకు అవసరం మేరకు మాత్రమే యూరియా వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో విఏఏ గోపిరామ్, గిరిధర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులను పాటించాలని ఎఒ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గూడెం చెరువు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వరిలో ఉత్తమ యాజమాన్య పద్ధతులు, ఎరువుల వాడకం, వరి పంటలను ఆశించే ఆకుముడత, వరి నల్లి, మెడ విరుపు తెగులు వంటి చీడపీడల సస్యరక్షణ పద్ధతుల గురించి వివరించారు. రబీ సీజన్లో సాగు చేసే పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా ప్రీమియం చెల్లించే విధానాన్ని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకుడు శివశంకర్, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన బ్రహ్మంగారి జయంతి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠంలో బ్రహ్మంగారి 416వ జయంతి మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలు మఠం ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. చలువ పందిళ్లు, విద్యుత్ అలంకరణలతో బ్రహ్మంగారి ప్రాంగణమంతా వైభవంగా అలంకరించారు. భక్తులకు మేనేజర్ ఈశ్వరయ్య చారి అన్ని వసతులను ఏర్పాటు చేశారు.

'సూపర్ సిక్స్' అట్టర్ ఫ్లాప్

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ పాలనలో సూపర్ సిక్స్ పథకాలు అట్టర్ ఫ్లాప్ అని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాయమాటలు చెప్పి యువత, మహిళలను నమ్మించి మోసగించిందని విమర్శించారు. వైసిపి అటు అధికారానికి, ఇటు ప్రతిపక్షానికి పనికిరాదన్నారు. ఇంటింటా సౌభాగ్యం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. అది కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో తేలిపోయిందని తెలిపారు. కొన్ని పథకాలకు బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు. మరి కొన్నిటికి అరకొర కేటాయింపులు చేశారన్నారు. నిరుద్యోగ భృతికి కేటాయింపులు లేవన్నారు. రాష్ట్ర పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లుగా కూటమి ప్రభుత్వం తయారైందని చెప్పారు.

రాయితీ మినుములు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా చిరు సంచులు పథకం కింద వంద శాతం రాయితీతో అందిస్తున్న మినుములను సద్వినియోగం చేసుకోవాలని ముద్దనూరు సహాయ సంచాలకులు వెంకట సుబ్బయ్య, ఎఒ వెంకట కృష్ణారెడ్డి కోరారు. చింతకుంట గ్రామంలో మంగళవారం సర్పంచ్ తుమ్మలూరు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఎడిఎ, ఎఒ వంద శాతం రాయితీ మినుములను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విబిఎన్-8 రకం మినుములు వంద మంది రైతులకు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. విబియన్-8 రకం పల్లాకు తెగులును తట్టుకుంటుందన్నారు.

బోద వ్యాధిపై సర్వే

ప్రజాశక్తి - వేముల

వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బెస్తవారిపల్లె లో బోదవ్యాధి సర్వే సందర్భంగా సోమవారం రాత్రి గ్రామంలో రక్త పూతల సేకరణ చేశారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ బోదవ్యాధి క్యూలెక్స్ దోమకాటు ద్వారా వ్యాపిస్తుందన్నారు. ఈ వ్యాధి ప్రాణాంతకం కాక పోయినప్పటికీ తీవ్రమైన శారీరక, మానసిక ఇబ్బందులను కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ వీణకుమారి, ఆరోగ్య కార్యకర్త నాగేశ్వరి, ఆశా కార్యకర్తలు శాంతి, లక్ష్మీదేవి, లక్ష్మీ దేవమ్మ పాల్గొన్నారు.

పోలవరం పూర్తయి ఉంటే అభివృద్ధి జరిగేది..!

- కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త సింగం శివమోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వైసిపి ప్రభుత్వంలో పోలవరం పూర్తయి ఉంటే అభివృద్ధి జరిగేదని జమ్మలమడుగు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త సింగం శివమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాలతో నియోజకవర్గ బాధ్యతలు స్వీకరించానని తెలిపారు. జిల్లాలో జగన్‌రెడ్డి ఉక్కు పరిశ్రమకు టెంకాయలు కొట్టడమే సరి పోయిందన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యలపై కాంగ్రెస్ తరపున పోరాటం చేస్తామని తెలిపారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో జమ్మలమడుగు కాంగ్రెస్ నేత పాముల బ్రహ్మానందరెడ్డి, మద్రి ప్రకాశం, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఎంఇఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

విద్యాశాఖాధికారుల అలసత్వం వల్ల మండలంలో విద్యా వ్యవస్థ ఛిన్నాభిన్నంగా ఉందని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న విద్యాశాఖాధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థి, యువజన ప్రజాసంఘాల నాయకులు కత్తి ఓబులేసు, గడ్డం నరసింహులు, ములపాక ప్రతాపరెడ్డి, బయన్న, మహిళా అధ్యక్షురాలు చెన్నమ్మ మాదిగలు కోరారు. ఆ మేరకు వారు డిప్యూటీ డిఈఒ మీనాక్షికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. విద్యా రంగంలో కడప అనంతరం అంతటి స్థాయి కలిగిన ప్రొద్దుటూరు పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని వారు కోరారు.

వేలం ప్రకటన

కడప జిల్లా, ప్రొద్దుటూరు నందు వెలసిన శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానమునకు సంబంధించి టెంకాయల అంగడి పెట్టుకొని, అమ్ముకొను హక్కునకు, 1 సంవత్సర కాల పరిమితికి తేది: 20.11.2024 న ఉదయం. 11-00 గం.లకు మరియు షాపు D/No 502 AB రూమును నెల బాడుగకు 3 సంవత్సరముల కాల పరిమితికి తేది: 20.11.2024న మధ్యాహ్నం 12-00 గం.లకు దేవస్థానము నందు డిపార్ట్మెంట్ అధికారుల సమక్షమున బహిరంగ వేలము జరుగును.

K. రామచంద్రాచార్యులు, M.A B.Ed.,
కార్యనిర్వహణాధికారి
శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానం,
దేవదాయశాఖ, ప్రొద్దుటూరు టౌన్,
వై.యస్.అర్. కడప జిల్లా

IN THE COURT OF THE HON'BLE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE :: KADAPA
O.S.No.248/2023

Bathula Pedda Ramaiah. ...Plaintiff
Vs
Beri Ratnaraj, s/o. B.Y.Vara Prasad, aged about 49 years, Employee, resident of D/No.7/628, Mruthyunjayakunta, Chinnachowk, Kadapa City. ... Defendant

SUMMONS TO THE DEFENDANT

That the above suit is filed by the Plaintiff for recovery of amount under Promissory Notes and the matter is posted to 5.12.2024 for your appearance. Please take notice and appear on 5.12.2024 at 10.30 AM before the above Court, either in person or through Advocate, failing which the matter will be heard and disposed in your absence.

//By the Order of the Court//
M.VENKATA RAMANA
Advocate,
Kadapa

మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 362/2020

జి.గురులక్ష్మీదేవి, W/o లక్ష్మినారాయణ, 57 సం॥లు, హిందూ, డోర్‌నెం.2/552, బాలాజీనగర్, వైఎమ్ఆర్ కాలనీ, ప్రొద్దుటూరు, కడప జిల్లా. ...వాది
Vs
వై.సూర్యనారాయణ, S/o వెంకటయ్య, 62 సం॥లు, హిందూ, డోర్‌నెం.8/633,గోడౌన్‌వీధి, ప్రొద్దుటూరు,కడప జిల్లా. ...ప్రతివాది

దావా సమను

పై నెంబరు దావాను దావా ప్రోనోటు రూ.2,20,913లు వసూలు కోరి మీ పైన దాఖలు చేసి ఉంటున్నారు. అట్టి దావాలో మీరు హాజరు అగుటకు గానూ 12.12.2024వ తేదీన వాయిదా ఉంటున్నది. సదరు వాయిదా నాడు ఉదయం 10.30 గం॥లకు ఖుద్దున గానీ లేదా వకీలు ద్వారా గానీ ఆక్షేపణలు ఉన్న పై కోర్టులో తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేది: 12.12.2024

//By Order of the Court//
G.SRINIVASULU, B.Com.,B.L.,
Advocate
PRODDATUR.

BEFORE THE HON'BLE MACT-CUM-IVth Addl. DISTRICT JUDGE, KADAPA
I.A.No. 822/2024
M.V.O.P.No. 355/2022

Galipapaiah, S/o Late G.Peddaiah, Aged about 54 years, Hindu, Employee in Irrigation Departme nt as Record Assistant, R/at S.K.R.Nagar, Harijanawada, Madhavaram-I, Siddhout (Mandal), YSR Kadapa (Dt). ...Petitioner/Claimant
Vs
1. K.Sudharshan Reddy, S/o. Surya Narayana Reddy, Aged not Known, but Major, Owner of the car bearing No. AP04-BG-5062, Resident of Rajeswari Nagar, Modampalli, Proddatur (Town & Mandalam), YSR Kadapa Dt.. ...Respondent No.2

NOTICE TO RESPONDENT NO.2

ఇందుమూలముగా తెలియజేయడమేమనగా పై M.V.O.P.No. 355/2022లోని పిటిషనర్ సెక్షను 166 M.V. Act క్రింద నష్టపరిహారము కోరి పై కేసు దాఖలు చేసి యున్నాడు. మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 11.12.2024 తేదీన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల పరోక్షమున తీర్మానించబడును.

//కోర్టు వారి ఉత్తర్వు మేరకు//
B.VIJAYA KUMAR, B.A.,B.L.,
Advocate & Notary,
Kadapa.

కరువు మండలాలు ప్రకటించాలని వినతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

తహశీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న సిపిఎం నాయకులు

జిల్లాలో కరువు మండలాలను ప్రకటించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి జి.ఏసుదాసు కోరారు. మంగళవారం సిపిఎం రాష్ట్ర జిల్లా కమిటీ పిలుపుమేరకు ప్రజాభేరిలో భాగంగా తహశీల్దార్ కె.శ్రీనివాసులురెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలపై దాదాపు రూ.18 వేల కోట్లు తీవ్రమైన భారం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో తీవ్రమైన కరువు నెలకొందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో ప్రజలపై విద్యుత్ ట్రూ ఆఫ్ ఛార్జీల పేరుతో భారాలు మోపడం చాలా బాధకరమన్నారు. సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఎ. వినయ్‌కుమార్, డి.విజయ్, హుస్సేన్ వలి, కమాల్ బాషా, శ్రీను, ఖాదర్ పాల్గొన్నారు.

నిరక్షరాస్యత నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

నిరక్షరాస్యత నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో కృష్ణమూర్తి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో అక్షరవెలుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన వాలంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ 15ఏళ్ల పైబడిన వారికి అక్షరవెలుగు కార్యక్రమం ద్వారా విద్య నేర్పించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యాప్తంగా నిరక్షరాస్యులను గుర్తించి వారికి విద్యను అందించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి-2 శారద, వెలుగు ఎపిఎం మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

చక్రాయపేట : మండలంలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులు చేయాలని, అందులో భాగంగా మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో వాలంటీర్లు, ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చినట్లు ఎంపీడీవో రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. వయోజన విద్యాశాఖ ద్వారా మండలంలోని 570 మంది నిరక్షరాస్యులను గుర్తించారన్నారు. వారిని అక్షరాస్యులుగా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఎంపిడిఒ రాజశేఖర్‌రెడ్డి, ఎంఇఒ-2 రవికుమార్‌రెడ్డి, ఏపిఎంలు ట్రైనింగ్ శిక్షకులు శిక్షణనిచ్చారు.

ముద్దనూరు : నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులనుగా తీర్చిదిద్దాలని ఎంపిడిఒ ముకుందరెడ్డి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమంపై అంగన్వాడీ టీచర్లు, గ్రామ సమాఖ్య కార్యకర్తలకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ నాగేశ్వర నాయక్, ఐసిడిఎస్ సీడీపీఒ ముంతాజ్ బేగం, ఎపిఎం గంగయ్య, అంగన్వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న బీరం సుబ్బారెడ్డి

జాతీయ స్థాయి హాకీ క్రీడా పోటీలకు 'బీరం' విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని కొత్త నెల్లూరు సమీపంలో ఉన్న బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాల విద్యార్థి డి.చేతన్ ప్రతిస్ట్ జాతీయస్థాయి హాకీ క్రీడా పోటీలకు అర్హత సాధించారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో జరిగిన ఎస్జీఎఫ్ 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన హాకీ పోటీల్లో జిల్లా స్థాయిలో పాల్గొని, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. త్వరలో జరగనున్న జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థి డి.చేతన్ ప్రతిస్ట్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా మంగళవారం బీరం విద్యాసంస్థల అధినేత బీరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. చదువుతోపాటు తమ పాఠశాలలో క్రీడలకు ఎంతో ప్రాముఖ్యత ఇస్తున్నామన్నారు. విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీసి వారికి ఏ రంగంపై ఆసక్తి ఉందో ఆ రంగంలో వాళ్లను ఉన్నతంగా తీర్చి దిద్దుతున్నామన్నారు. క్రీడల పట్ల ఎక్కువ ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ పాఠశాలలో చేరితే క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థి చేతన్ ప్రతిస్ట్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో బీరం శ్రీధర్‌రెడ్డి విద్యా సంస్థల డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత, కళాశాల ప్రిన్సిపల్ హేమచందర్, వ్యాయామ ఉపాధ్యాయులు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ ఖాదర్‌వలి

జాతీయ స్థాయి పోటీలకు 'వివేకానంద' విద్యార్థులు

సింహాద్రిపురం : రగ్బీ పోటీల్లో జాతీయస్థాయికి తమ విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమని శ్రీవివేకానంద హైస్కూల్ కరస్పాండెంట్ ఖాదర్‌వలి, డైరెక్టర్ జాఫర్ తెలిపారు. స్థానిక శ్రీవివేకానంద హైస్కూల్లో మంగళవారం ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమలాపురంలో శని, ఆదివారాల్లో జరిగిన రగ్బీ రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల విభాగంలో ఎస్‌జిఎఫ్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు దీక్షిత, అతికుల్ రెహమాన్ జాతీయ స్థాయికి ఎంపిక య్యారన్నారు. తమ పాఠశాలలో విద్యతోపాటు క్రీడలను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి విద్యతోపాటు ఇతర రంగాల్లో నైపుణ్యం సాధించినప్పుడే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పిఈటి త్రిలోక్‌నాథ్ రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
E.P.No.28/2020
O.S.No. 59/2015

సయ్యద్ సాజిదా భాను, W/o గులామ్ జిలాన్, ముస్లిం, 45సం॥లు, డోర్‌నెం.22/13-1, ఖాదర్ హుస్సేన్ మసీదు వీధి, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా. ...పిటిషనరు/D.Hr.
Vs
కలైగిరి హయాతున్, W/o సర్దార్ జీ, ముస్లిం, 38సం॥లు, డోర్‌నెం.22/421-1, మౌలానా ఆజాద్‌వీధి-1, ప్రొద్దుటూరు టౌన్, కడప జిల్లా. ...రెస్పాండెంటు/J.Dr

నోటీసు

పై నెంబరు E.P. ని రెస్పాండెంటు/J.Dr. యొక్క ఆస్థిని రాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో E.P.No.136/2015 in O.S.No.172/2014 నెంబరులో వేలం జరగగా, సదరు పిటిషన్ క్లైమ్ మొత్తం పోగా రూ.1,24,357లు మొత్తంను రాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టుకు పంపుటకు గానూ పై E.P.No.28/2020 in O.S.No.59/2015ని దాఖలు చేసి ఉంటున్నారు. మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 16.12.2024వ తేదీన ఉదయం 10.30 గం॥లకు ఖుద్దున గానీ లేదా వకీలు ద్వారా గానీ పై కోర్టులో తెలుపుకొనవలెసి ఉంటున్నది. లేనంతట మీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

వాయిదా తేది: 16.12.2024

//By Order of the Court//
G.SRINIVASULU, B.Com.,B.L.,
Advocate
PRODDATUR.